సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



ఉద్దానం కష్టాలు తీర్చాం

పలాసలో మేధావుల సదస్సు జరిగింది. ప్రభుత్వం చేసిన మేలును వివరించారు.

- 8లో



నేడు ఓటర్ల జాబితా విడుదల

ఓటర్ల జాబితా ముసాయిదా నేడు విడుదల కానుంది. అభ్యంతరాలు ఉంటే చెప్పుకోవచ్చు.

- 8లో

30 నుంచి బీఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో బి.ఎస్.ఎన్.ఎల్. వినియోగదారులకు పారదర్శకమైన, మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఈ నెల 30 నుంచి నవంబరు 5 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ జనరల్ మేనేజర్ జె.శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం కార్యాచరణ ప్రదేశంలో జరిగే ఈ కార్యక్రమంలో అవినీతిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

న్యూస్‌రీల్

చంద్ర గ్రహణం రేపు

అరసవల్లి: రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 28న శనివారం రాత్రి 7 గంటల నుంచి ఆలయాన్ని మూసివేస్తున్నామని, తిరిగి సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాల తర్వాత ఆదివారం ఉదయం 7 గంటలకు ఆలయ ప్రధాన తలుపులు తెరుస్తామని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు తెలియజేశారు. చంద్రగ్రహణం పాక్షికంగా ఉన్న కారణంగా భక్తుల దర్శనాలకు పెద్దగా ఇబ్బందులు తలెత్తడం లేదని, అయితే ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనాలకు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు. గ్రహణ సమయాన్ని, శుద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు సహకరించాలని వారు కోరారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు తాడివలస విద్యార్థులు

పొందూరు: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు తాడివలస ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం బల్ల కంటయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు ధవళ పెంటయ్యలు తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో అనంతపురంలోని ఆర్‌టీడీ స్టేడియంలో జరగనున్న జూడో పోటీల్లో కొత్తకోట నితిన్, వాకముల్లు కౌశిక్, కూన శివరామరాజు, మెట్ట ఛార్మి, గొల్లపల్లి నీలిమలు పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తేవాలని తెలిపారు.

● జన బాహుదా.. అభిమానమంటే ఇదే కదా

ఇచ్ఛాపురం బహిరంగ సభకు హాజరైన జన వాహిని





వేదికపై మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో మంత్రులు బొత్స, సీదిరి, మేరుగ నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: బీసీ నేతల ప్రసంగాలకు ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



ఇచ్ఛాపురం రూరల్: తరలివస్తున్న మహిళలు



సభా వేదికపై వంగపండు ఉషా ఆటా-పాటా

సంక్షేమానికి సలామ్..

జన బాహుదా పరవళ్లు తొక్కింది. అభిమానమంటే ఇది కదా అనే రీతిలో బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభించింది. సంక్షేమం పొందిన వారంతా స్వచ్ఛందంగా కదిలివచ్చారు. జరిగిన మేలును గుండెల్లో ఉంచుకుని దారుల్లో బారులు తీరి నిలుచున్నారు. బడుగు వర్గాలకు చేసిన మంచిని మంత్రులు వివరిస్తూ ఉంటే బతుకుల్లో వచ్చిన మార్పును గుర్తుచేసుకున్నారు. బలహీనులకు సర్కారు అందించిన సాయాన్ని జ్ఞప్తికి తెస్తూ ఉంటే చప్పట్ల రూపంలో కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్ఛాపురంలో వైఎస్సార్ సీపీ మొదలుపెట్టిన సామాజిక సాధికార యాత్ర తొలి రోజు జనాభిమానం చూరగొంది.

- వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన
- జనాలతో కిట కిటలాడిన ఇచ్ఛాపురం రహదారులు
- తొలి రోజే గ్రాండ్ సక్సెస్
- తరలివచ్చిన మహిళా లోకం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర తిరునాళ్లను తలపించింది. ఎటు చూసినా జనాలే. ఏ రోడ్డు చూసినా జన ప్రభంజనమే. దాదాపు 40 వేలకు పైగా తరలివచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలతో ఇచ్ఛాపురం పాత బస్టాండ్ సభా స్థలి కిటకిటలాడింది. చూడటానికి రెండు కళ్లు సరిపోలేదు.

ఇచ్ఛాపురంలో గతంలో అనేక బహిరంగ సభలు జరిగాయి. వాటిలో బెస్ట్ అనుకునేవి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర ముగింపు సభ, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ముగింపు సభ, వైఎస్సార్ ముద్దుల తనయ వైఎస్ షర్మిల చేపట్టిన పాదయాత్ర ముగింపు కార్యక్రమాలే. ఈ మూడింటిలో వైఎస్ జగన్ పాదయాత్ర ముగింపు సభ కన్నుల పండువలా జరిగింది. ఇప్పుడు ఆ సభను తలపించేలా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సభ జరిగింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి నియోజకవర్గంలో ఇంతటి పెద్ద సభ జరగలేదు. ఈ నేపథ్యంలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాలకు చెందిన పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు, మద్దతుదారులు సభాప్రాంగణానికి చేరుకున్నారు. దారి పొడవునా పార్టీ జెండాలతో జై జగన్ నినాదాలు చేస్తూ నృత్యాలు చేస్తూ ర్యాలీగా వచ్చారు. ఆయా గ్రామాలకు చెందిన వాళ్లంతా సభాస్థలికి చేరుకునేందుకు ఒకేసారి ర్యాలీగా రావడంతో మండలాల్లోని అన్ని ప్రధాన మార్గాలు జనసంద్రంగా మారాయి. డీజే బాక్స్‌లు సైతం ఆటోలకు అమర్చి జగన్ పాటలతో హోరెత్తించారు.

అంతకుముందు బడుగు బలహీన వర్గాలకు జరిగిన మేలును తెలియజేసే ఉద్దేశంలో భాగంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర శ్రీకాకుళంలో ప్రారంభమైంది. మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు.



శ్రీకాకుళంలో జెండా ఊపి బస్సుయాత్రను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రభుత్వ మద్దతు నినాదాలు, అభిమానుల కేరింతలతో యాత్ర ఆరంభంలోనే హోరెత్తిపోయింది. పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభమైన బస్సు యాత్ర మడపాం, కోటబొమ్మాళి జాతీయ రహదారి మీదుగా పలాసకు చేరుకుంది. దారి పొడవునా వైఎస్సార్‌సీపీ అభిమానులు, ప్రజలు స్వాగతం పలికారు. దారి మధ్యలోనే బస్సును ఆపి తమ మద్దతు తెలియజేశారు. బస్సును అనుసరిస్తూ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. దీంతో కొన్ని కిలోమీటర్ల మేర బడుగు, బలహీన వర్గాల సందడే కన్పించింది. మడపాంలో బ్రహ్మరథం పట్టడమే కాకుండా టపాసులతో తమ ఆనందాన్ని తెలియజేశారు. కోటబొమ్మాళిలో సమన్వయకర్త దువ్వాడ వాణి, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ నేతృత్వంలో అపూర్వ స్వాగతం పలికారు. బైక్ ర్యాలీతో వచ్చి బస్సు యాత్ర చేస్తున్న నేతలకు నీరాజనం పలికారు. పల్లె పల్లె కదలివచ్చినట్టు వెనకబడిన వర్గాలకు చెందిన ప్రజలు జాతీయ రహదారిపై బారులు తీరారు. పలాసలో మేధావులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ప్రభుత్వం చేసిన సామాజిక న్యాయాన్ని, సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు. ఇక్కడ కూడా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి హర్షం తెలియజేశారు. అక్కడి నుంచి బయలు దేరిన బస్సు యాత్ర కంచిలి మండలం బూరగాంకు చేరుకుంది. అక్కడ స్థానికంగా ఉన్న సచివాలయాన్ని నేతలు సందర్శించారు. కార్యకలాపాలు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, మహిళలతో మాట్లాడారు. నాడు-నేడు పనులు కూడా పరిశీలించారు. అనంతరం ఇచ్ఛాపురంలో నిర్వహించిన బహిరంగ సభ వరకు బస్సు యాత్ర సాగింది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు వెనకబడిన వర్గాలకు ఈ ప్రభుత్వం ఎంత మేలు చేసింది. రాజ్యాధికారంలో ఏ స్థాయిలో భాగస్వామ్యం చేసిందన్నది సభా వేదికగా నేతలంతా ప్రజలకు వివరించారు.



జన సంక్షేమమే ఎజెండా
మహిళ ఆనందం

బహిరంగ సభ ప్రారంభానికి ముందు ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌లు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీసుబ్బారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఏఎన్ మూర్తి, జిల్లాపరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, వరుదు కళ్యాణి, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, కంబాల జోగులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు పేరాడ తిలక్, దుక్క లోకేశ్వరరావు, సాడిశ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, యూత్‌వింగ్ జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్, ఎన్ఆర్ఐ ప్రతినిధి పి.రత్నాకర్, ఎంపీపీ బోర పుష్ప, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాభాల స్వర్ణమణి, మండల వైస్ ఎంపీపీలు వివేకానంద్, సర్పంచ్‌లు, వైస్‌సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: సభకు తరలివస్తున్న బీసీ మహిళలు



అభిమాన నేతలకు మహిళల అభివాదం

అన్ని వర్గాలకు ఉన్నతి



వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలో అన్ని వర్గాలకు ఉన్నతి. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు గత ప్రభుత్వం ఏమీ చేయలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల స్థితి గతులు మెరుగుపడ్డాయి. ఇంతటి సామాజిక విప్లవానికి నాంది పలికిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటి వారు ఎంతో రుణపడి ఉన్నారు. ఆయనకు ప్రజలంతా తోడుగా ఉండి మరోసారి గెలిపించుకోవాలి. – మేరుగ నాగార్జున, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి

టీడీపీ మాట నిలబెట్టుకోలేదు



టీడీపీ 600 హామీలు ఇచ్చి ఆరు కూడా నెరవేర్చలేదు. కానీ వైఎస్సార్ సీపీ చెప్పిన పనులన్నీ చేసింది. టీడీపీ పాలన అంతా దోచుకో దాచుకో అన్నట్టుగా సాగింది. అది గమనించే గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్పారు. ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యే కూడా ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదు.
– పిరియా సాయిరాజ్, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త

కంచిలి, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం రూరల్, కవిటి, సోంపేట : వినూత్న పాలనతో సమున్నత ఫలాలు అందుకునేలా నాలుగున్నరేళ్ల పనిచేశామని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద రావు అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంలో సామాజిక సాధికార బస్సు యాత్రను గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఆయనతో పాటు ఇతర మంత్రులు కూడా ఉద్వేగంగా మాట్లాడారు. నాలుగున్నరేళ్ల పాలనను ప్రజల ముందు ఉంచారు.

ఏం చేశామో చెప్పడానికే వచ్చాం..



వైఎస్ జగన్ పాదయాత్ర ముగింపు సమావేశం ఇక్కడే ఇచ్ఛాపురంలో జరిగింది. ఆనాడు చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న అక్రమాల గురించి వ్యాఖ్యలు చేశాం. ఈనాడు నాలుగున్నరేళ్ల కాలంలో మేం ఏం చేశామో చెప్పడానికి వచ్చాం. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు కట్టించే బాధ్యతను మన రాజ్యాంగం ఇచ్చింది. ఇందులో భాగంగా 32 లక్షల మందికి స్థలాల ఇచ్చి ఇళ్లను మంజూరు చేసింది ఈ ప్రభుత్వం. అన్ని స్థాయిల్లో అవినీతిని నిర్మూలన చేశాం. ఉద్దానం కిడ్నీవ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశాం, రూ.700 కోట్లతో ఉపరితల జలాలు వంశధార నుంచి పైపు లైన్ల ద్వారా అందించే ఏర్పాటు చేశాం. చంద్రబాబుకు జిల్లా గురించి మాట్లాడే హక్కు లేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కి 23 సంస్థలు కేంద్రం ఇస్తే, ఒక్కటి కూడా మన జిల్లాలో ఏర్పాటు చేయలేదు. మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు, ఎంపీ హోదాలో రామ్మోహన్ నాయుడు ఆనాడు ఏం చేశారు. టీడీపీ దొంగలకు మళ్లీ అవకాశం ఇస్తే దోచుకుతింటారు. ఇచ్ఛాపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరి తీరాల్సిందే.
– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి

బీసీలంటే బాబుకు మంట



టీడీపీ అధికారంలో ఉండగా బీసీలంటే చంద్రబాబుకు కడుపు మంట. తొక్క తీస్తా, తోలు తీస్తానంటూ బీసీలపై విరుచుకుపడ్డారు. ఎస్సీల కడుపులో ఎవరు పుట్టాలంటూ అవమానకరంగా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు తొక్క తీసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సిద్ధంగా ఉన్నారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పీడిక రాజన్నదొరను ఉప ముఖ్యమంత్రిగా చేసి తన పక్కనే కూర్చోబెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో చంద్రబాబుకు పోలికే లేదు. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ సింహ భాగం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే దక్కాయి. – సీదిరి అప్పలరాజు, పాడి, పశుసంవర్థక శాఖ మంత్రి

జెండా ఎగరేద్దాం



గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను 98 శాతం అమలు చేశాం. బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుంది. రాబోయే ఎన్నికల్లో మనమంతా ఐక్యతగా పనిచేసి ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం. జగనన్న సురక్ష, వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నారు. – ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

మళ్లీ జగనే సీఎం..

వైఎస్సార్ కుటుంబం అంటే నాకు ఎంతో అభిమానం. ఆయన హయాంలోనే నాకు దివ్యాంగ పింఛన్ వచ్చింది. ఆయన కుమారుడు వైఎస్ జగన్ పాలనలో వలంటీరు ఇంటికే తెచ్చి ఇస్తున్నాడు. మా గ్రామానికి ఈ రోజు మంత్రులు వస్తున్నారని చెప్పడంతో ఇలా నా అభిమానం చాటుకోవడానికి వచ్చాను. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.
– దుంగ వాసుదేవు, బూరగాం



మంత్రుల ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకిస్తున్న దివ్యాంగుడు వాసుదేవు



శ్రీకాకుళంలో విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి బొత్స. చిత్రంలో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు ధర్మాన, మేరుగ నాగార్జున, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీలు , ఎమ్మెల్యేలు



నందిగాం: పార్టీ శ్రేణులతో నిర్వహించిన బైక్ ర్యాలీలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్టీలు

ఆమదాలవలస: తమకు ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ (సీఆర్ఎంటీఎస్) ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద శాసన సభాపతి తమ్మినేని సీతారాంను కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సభ్యుడు పి.తవిటినాయుడు, జిల్లా అధ్యక్షుడు బి.గిరి, జిల్లా కార్యదర్శి బి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ టోర్నీలో తవిటమ్మ ప్రతిభ



పీడీ తవిటమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస రూరల్: అఖిల భారత ప్రజా సేవల టోర్నమెంట్ కబడ్డీ పోటీల్లో ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ జెడ్పీ హైస్కూల్ పీడీ దంపాక తవిటమ్మ విజయం సాధించినట్లు హెచ్ఎం ఎం.తులసీబాయ్ తెలిపారు. గురువారం పీడీని సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 20 వరకు ఢిల్లీలో జరిగిన టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళల కబడ్డీ విభాగంలో జిల్లా తరఫున పీడీ ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. చురుకైన పాత్ర పోషించడంతో మెడల్ అందజేశారని చెప్పారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ ఎంపికలు



పోటీలను ప్రారంభిస్తున్న బలభద్రుని సురేష్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ/ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజయబావుటా ఎగురవేయాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా జిల్లా అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి అండర్–19 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీలు జరిగాయి. సీహెచ్ పల్లవి(ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళం), కె.ఎస్.భవాని(ప్రభుత్వ జూనియర్ కళాశాల, పోలాకి), వై.మౌనిక(ఏపీ మోడల్ స్కూల్, ఎదుర్లవలస), బి.ఝాన్సీరాణి(ప్రభుత్వ జూనియర్ కళాశాల, పొందూరు) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి ఎస్.రామన్న, పరిశీలకులు డి.భవానీ(పి.డి), న్యాయ నిర్ణేత ఫెన్సింగ్ ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ, పీఈటీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం కష్టాలు తీర్చాం

- ప్రభుత్వ పాలన, సంక్షేమాభివృద్ధిని వివరించేందుకు బస్సుయాత్ర
- పలాస మేధావుల సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ



పలాసలో జరిగిన మేధావుల సదస్సుకు హాజరైన ప్రముఖులు

కాశీబుగ్గ: ప్రజాసంకల్ప పాదయాత్రలో ఉద్దాన ప్రజలకు ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా పలాస టి.కె.ఆర్.కల్యాణ మండపంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఉద్దాన వాసుల కష్టాలు తీర్చలేదన్నారు. సీఎం జగన్ మాత్రం రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్‌సెంటర్, 200 పడకల ఆసుపత్రి నిర్మించారని చెప్పారు. త్వరలోనే ప్రారంభోత్సవానికి సీఎంతో కలిసి ఇక్కడికి వస్తామని చెప్పారు. ప్రభుత్వ పాలన, సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకే బస్సుయాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి మేరుగు నాగార్జున, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పాలకొండ ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీలు కంభంపాటి రవికుమార్, వరుదు కళ్యాణి, పాలవలస విక్రాంత్, టెక్కలి ఇన్‌చార్జి దువ్వాడ వాణి, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, జోగి నాయుడు, పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, కరిమి రాజేశ్వరరావు, కడప రత్నాకర్, బల్ల గిరిబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు, మేధావులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం..

రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోంది. పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం. పలాస నియోజకవర్గంలో రూ.700 కోట్లతో మంచి నీటి పథకం, రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆసుపత్రి నిర్మాణం, సచివాలయాలు, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాం. నాడు–నేడుతో పాఠశాలలు, ఆస్పత్రులు ఆధునీకరించాం.

– **డాక్టర్ సీదిరి అప్పలరాజు**, రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి

మాట నిలబెట్టుకున్నారు..



2004లో వైఎస్సార్ ఆర్టీసీకి జీవం పోశారు. మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీని విలీనం చేయడం ఆనందంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా మాలాంటి ఉద్యోగులకు నెలకు రూ.270 కోట్లు చెల్లిస్తున్నారు. బడుగుబలహీన వర్గాలవారికి ఎటువంటి సౌకర్యాలు అందుతున్నాయో ఆర్టీసీ ఉద్యోగులకు సైతం అందుతున్నాయి. ఆర్టీసీలో మిగిలిన సమస్యలు కూడా పరిష్కరించాలి.

– **పినకాన వాలి**, ఆర్టీసీ ఉద్యోగి, పలాస

రైతులకు భరోసా..



అన్నదాతల కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం చరిత్రాత్మకం. ఉద్దాన రైతులు పండిస్తున్న జీడిపిక్కలకు మద్దతు ధర లేదు. పిక్కల నుంచి వచ్చే పప్పుకు మద్దతు ధర ఉంది. దీంతో రైతులకు న్యాయం జరగడం లేదు. ఉద్దాన ప్రాంతంలో ఉపాధి నిమిత్తం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– **మామిడి మాధవరావు**, ఉద్దాన రైతాంగ పోరాట కమిటీ ప్రతినిధి

కరోనాలోనూ ఉపాధి..



ప్రపంచం మొత్తం కరోనా విరుచుకుపడుతున్న సమయంలో పలాసలో మాత్రమే పరిశ్రమలు పనిచేశాయి. 20 వేల మంది మహిళలకు ఉపాధి లభించింది. ఇప్పటికీ ఉపాధి కొనసాగుతోంది. పలాసకు మరో కొత్త పారిశ్రామికవాడ అందిస్తే మరిన్ని పరిశ్రమలు ప్రారంభమై అనేక మందికి ఉపాధి కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పలాస జీడి పరిశ్రమలకు రుణాలు, ప్రోత్సాహకాలు అందిస్తోంది.

– **పి.వి.శివకృష్ణ**, పలాస కాష్యూ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ కార్యదర్శి

సీఎంకు ధన్యవాదాలు



కూరగాయలు పండించుకునే పొందర కులస్తులకు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం నిజమైన సామాజిక బాధ్యత. అన్ని కులాలకు సామాజిక న్యాయం చేస్తూ సీఎం పాలన సాగిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు సైతం అమ్మఒడి పథకం అందించడం గొప్ప విషయం. మా పొందర కులస్తులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సైతం ముఖ్యమంత్రి వెంటే ఉంటాం.

– **దుర్గాశంకర్ పాత్రో**, రాష్ట్ర ప్రయివేటు స్కూల్ అసోసియేషన్, రాష్ట్ర పొందర కుల కార్యవర్గ సభ్యుడు

అన్నదాతను ఆదుకుంటాం



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రులు

- బూరగాం సచివాలయం సందర్శనలో మంత్రులు
- గ్రామస్తులతో ముఖాముఖి

సోంపేట,కంచిలి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురవకపోవడంతో పంటల సాగు ఆశాజనంగా లేని విషయం తమ దృష్టికి వచ్చిందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, వ్యవసాయశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా కంచిలి మండలం బూరగాం గ్రామ సచివాలయాన్ని మంత్రుల బృందం గురువారం సందర్శించింది. ఏఎన్ఎం సుమలత బెహరాతో మాట్లాడి ప్రజల ఆరోగ్య వివరాలు, జగనన్న ఆరోగ్య సురక్షలో ఎంతమందికి వైద్యపరీక్షలు చేశారో అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ అసిస్టెంట్ చింతల రాజకిశోర్, సచివాలయ కార్యదర్శి మహమ్మద్ సల్మాన్‌తో కూడా మాట్లాడారు. సచివాలయం పరిధిలో ఎంతమంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారని అడగ్గా.. అర్హులందరికీ మంజూరు చేశామని.. ప్రస్తుతానికి వినతుల్లేవని డిజిటల్ అసిస్టెంట్ చెప్పగా.. దీనికి మంత్రి అంగీకరించలేదు. ఇంకా ఎవరైనా ఉండవచ్చునని.. గ్రామంలో సర్వే చేపట్టి వివరాలు సేకరిస్తామని మంత్రి చెప్పారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ బంజుమోహినితో మాట్లాడుతూ పింఛన్ల ఆరా తీశారు. దీనికి ఆమె బదులిస్తూ గ్రామానికి చెందిన 380 మందికి 10,49,500 రూపాయలను పింఛన్లుగా అందజేస్తున్నామన్నారు. వీరిలో 140 మంది వితంతువులు ఉన్నారని చెప్పడంతో మంత్రులు బొత్స, సీదిరి అప్పలరాజు విస్మయం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంతమంది వితంతువులుగా మారడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. చాలామంది యువత సారాకు బానిసవుతున్నారని, ఇక్కడకు కొద్ది దూరంలో సరిహద్దు ఒడిశా గ్రామాలు ఉండడంతో అక్కడకు వెళ్లి నాటుసారా తాగి కొంతమంది చనిపోతున్నారని వెల్ఫేర్ అసిస్టెంట్ మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి వారు స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు పుచ్చ భాగ్యలక్ష్మితో మాట్లాడి పంటల సాగు వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో 700 ఎకరాలు సాగు భూమి ఉండగా.. అంతా వర్షంపై ఆధారపడి ఉందని వ్యవసాయ సహాయకురాలు తెలియజేశారు. ఈ ఏడాది 300 ఎకరాల్లో వరినాట్లు వేసినప్పటికీ వర్షాలు లేక పోవడంతో ఎండి పోతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ రెవెన్యూ అధికారితో మాట్లాడి వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం ఆగిపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ బంధువులు కేసు వేయడంతో నిర్మాణం ఆగిపోయిందని, కోర్టులో కేసు నడుస్తోందని వీఆర్వో మంత్రికి తెలియజేశారు. స్థానిక సమస్యలపై ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డితో మంత్రి మాట్లాడారు. గ్రామంలో ఎక్కువ మంది వితంతువులు ఉండడంపై, పింఛన్లకు అర్హులుంటే గుర్తించాలని, ఖరీఫ్ పంటలు, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం నిలిచిపోవడంపై పూర్తి నివేదిక అందజేయాలన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయాలను తీసుకెళ్లి గ్రామానికి త్వరలో అధికారులను పంపిస్తామన్నారు.

ఆరోగ్యాలు పాడుచేసుకోవడం బాధాకరం..

గ్రామస్తులతో మంత్రులు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఎక్కువ మంది సారాకు బానిసలై ఆరోగ్యాలు పాడుచేసుకోవడం బాధాకరమన్నారు. గ్రామంలో 140 మంది వితంతువులు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవాలన్నారు. గ్రామానికి సాగు, తాగునీరు అందించాలని, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందిస్తూ రూ. 700 కోట్లతో ఏడు మండలాల ప్రజలకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ మంచినీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు.

దుర్గమ్మా.. చల్లంగా చూడమ్మా!



అమలపాడులో ఘటాల ఉత్సవం

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామం భక్త జనసంద్రమైంది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన దుర్గమ్మతల్లి ఘటాల ఉత్సవానికి అశేష జనవాహిని తరలివచ్చింది. పగటి వేషాలు, కాళీమాత వేషధారణ, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

దుర్గాదేవీ లేబర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో 108 మంది మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి తిరిగి దుర్గా మాత పూజా మందిరానికి చేరుకున్నారు. అక్కడ నుంచి అసిరిపోలమ్మ తల్లికి ముర్రాటలు, వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దున్న వీరస్వామి, కె.లింగరాజు, దుర్గా దేవి లేబర్ యూనియన్ నాయకులు ఇరోతు అప్పన్న, కర్ని ఎర్రయ్య, జె.రాజులు, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురంలో గురువారం ప్రారంభమైన సామాజిక సాధికార యాత్రకు విచ్చేసిన వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని పార్టీ శ్రీకాకుళం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెంటాడ స్వరూప్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ స్థితిగతులపై చర్చించారు.

– కంచిలి

ఇచ్ఛాపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ





కోటబొమ్మాళి వద్ద స్వాగతం చెప్పేందుకు వచ్చిన పార్టీ శ్రేణులు



బస్సుయాత్రలో భారీ వాహన శ్రేణి

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ జాబితా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఈ–క్రాప్ నమోదు శతశాతం పూర్తిచేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఖరీఫ్ – 2023 సీజన్‌లో 4.70లక్షల ఎకరాలలో పంటల సాగు, క్రాప్ పూర్తిచేశామని, అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26 నుంచి 29 వరకు ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు.


నగల దోపిడీకి యత్నం

సరుబుజ్జిలి: మండలంలో మర్రిపాడుకు చెందిన కందుల రమణమ్మపై గురువారం గుర్తు తెలియని వ్యక్తి ఆభరణాల కోసం దాడికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రమణమ్మ మర్రిపాడు నుంచి సరుబుజ్జిలిలోని బ్యాంకుకు వెళ్లింది. తిరిగి తన స్వగ్రామానికి వంశధార కుడి కాలువ గట్టుపై వస్తుండగా దారిలో ఆగంతకుడు వచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు భరణాలు దోపిడీ చేయడానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కిందపడింది. ఇటుక రాయితో గాయపరచి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన రమణమ్మను స్థానికులు వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ వద్ద ప్రస్తావించగా, ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఇచ్ఛాపురం	127235	133513	16	260764
పలాస	104162	108055	35	212252
టెక్కలి	116026	115915	12	231952
పాతపట్నం	110243	110336	19	220598
శ్రీకాకుళం	130774	132736	41	263551
ఆమదాలవలస	94066	95039	15	189120
ఎచ్చెర్ల	121199	118255	21	239475
నరసన్నపేట	104735	104680	14	209429
మొత్తం	9,08,440	9,18,529	173	18,27,142

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ ఈ నెల 27న జరగనుందని, వాటిలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ అధికారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో 15వ వారపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను పరిశీలించుకుని తొలగింపులు, చేర్పులు ఉంటే తెలియజేయాలన్నారు. ఫారం 6, 7, 8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. డిసెంబరు 9 వరకు స్వీకరించి అదే నెల 26 నాటికి వాటిని పరిష్కరిస్తామన్నారు. 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందన్నారు. ఓట్ల తొలగింపునకు తప్పుడు ఫారాలు అందజేస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాకు 7530 బ్యాలెట్ యూనిట్లు, 5850 కంట్రోల్ యూనిట్లు, 7070 వివి ప్యాట్లు చేరాయని వివరించారు. మొదటి దశ తనిఖీల ప్రకారం 2440 బ్యాలెట్ యూనిట్లు, 2020 కంట్రోల్ యూనిట్లు, 2300 వివిప్యాట్ పూర్తిగా పనిచేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈవీఎంలపై ఎటువంటి అపోహలు ఉన్నా నిపుణులు నివృత్తి చేస్తారని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు పీఎంజే బాబు, దేసెళ్ల గోవింద మల్లిబాబు, బి.కృష్ణమూర్తి, డి.గోవిందరావు, సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌వో గణపతిరావు

వృద్ధురాలి దారుణ హత్య



జీడితోటలో ఉన్న మృతదేహం(ఇన్‌సెట్లో) కామమ్మ(ఫైల్)

మందస: ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద పంచాయతీ చిన్నలొహరిబంద గ్రామానికి చెందిన తామాడ కామమ్మ(70) దారుణహత్యకు గురయ్యింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామమ్మకు ముగ్గురు కుమారులు. ప్రతి రోజూ తన జీడి, కొబ్బరితోటలను ఉదయాన్నే చూసేందుకు వెళ్లేది. యథావిధిగా ఈ నెల 25న వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుమారులు వెదకడం ప్రారంభించగా, ఆచూకీ లభించలేదు. గురువారం కూడా పరిసర ప్రాంత జీడి తోటల్లో వెతకగా, తలపై గాయాలతో ఉన్న కామమ్మ మృతదేహాన్ని గమనించిన కుమారులు మందస పోలీసులు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సీహెచ్ హరికృష్ణ, కానిస్టేబుళ్లు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి చెవిలో ఉన్న మూడు తులాల బంగారు నాగులు, ముక్కు కమ్ములు గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా తెంచుకుపోయినట్టు పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళం నుంచి డాగ్‌స్క్వాడ్‌ను తీసుకువచ్చి పరిశీలన చేయించారు. జాగిలం కొన్ని ప్రాంతాలకు వెళ్లడంతో ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి పెద్దకుమారుడు రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హరికృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

గడ్డిమందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని బొరిగిపేటకు చెందిన దివ్వల చిలకమ్మ(70) అనే వృద్ధురాలు గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకమ్మ తన భర్త మృతిచెందడంతో కుమారుడు వద్ద ఉండేది. అతను 12 ఏళ్ల క్రితం భార్య, పిల్లలను విడిచి వెళ్లిపోవడంతో కోడలు, ఆమె ఒకే ఇంట్లో వేరువేరుగా ఉండేవారు. ఒంటరితనం భరించలేక తన ఆస్తిలో కొంతభాగం కుమార్తె కె.నీలవేణికి, మరికొంత భాగం కుమారుడి పేరు మీద రాసి అనంతరం పురుగుల మందు తాగి మృతిచెందింది. ఈ మేరకు కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇరువర్గాల కొట్లాటలో 14 మందిపై కేసు

పాతపట్నం: ఇరువర్గాల కొట్లాట, పరస్పరం ఇచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం 14 మందిపై కేసులు నమోదు చేశామని పాతపట్నం ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు. బడ్డుమర్రి పంచాయతీ బాసిగిట్టంగిలో కొనంగి అప్పలనరసమ్మ(అంగన్‌వాడీ కార్యకర్త), రింపి బారికి వర్గాల మధ్య కొట్లాట జరిగింది. అప్పలనరసమ్మ భర్త వీరయ్యతో పాటు ఆరుగురిపై, అలాగే రింపి బారికి, రింపి జానకితో పాటు నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.